సాక్షి
సంగారెడ్డి
శుక్రవారం । 2 । ఆగస్టు । 2024



బీమా.. రైతుకు ధీమా

కొత్తగా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వివరాలు 8లో ▸



పనిలో కాదు బడిలో..

ఆటపాటలతో.. బడికి వెళ్లి చదువుకోవాల్సిన బాల్యం పరిశ్రమలు, హోటళ్లు, ఇటుక బట్టీల్లో మగ్గుతోంది. వివరాలు 8లో ▸



ఫైలేరియా నిర్మూలనకు..

జిన్నారం మండలం సోలక్‌పల్లిలో గురువారం ఫైలేరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివరాలు 8లో ▸

న్యూస్‌రీల్

బోధన్‌-బీదర్ రైల్వేలైన్‌కు మోక్షం కల్పించండి

- పార్లమెంట్‌లో ఎంపీ సురేశ్ షెట్కార్



మాట్లాడుతున్న ఎంపీ సురేశ్ షెట్కార్

నారాయణఖేడ్: బోధన్‌-బీదర్ రైల్వేలైన్‌కు మోక్షం కల్పించాలని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ గురువారం పార్లమెంట్‌లో కోరారు. పదేళ్ల కిందట తాను ఎంపీగా ఉన్నప్పుడే రైల్వే లైను సర్వే జరిగిందన్నారు. ఆ తర్వాత ఎలాంటి పురోగతి లేదన్నారు. ఈ లైను వల్ల పిట్లం, బాన్సువాడ, నారాయణఖేడ్ ప్రాంతాలవారి తోపాటు కర్ణాటకలోని బీదర్, గుల్బర్గా ప్రాంతాలకు చెందిన వేలాదిమందికి ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర మూడు రాష్ట్రాల మధ్య అనుసంధానంగా ఉంటుందన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్ట ఆయకట్టు రైతులకు వ్యవసాయ ఉత్పత్తులను తరలించుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు.

మర్యాద పూర్వకంగా..



సీఎం రేవంత్‌తో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు

పటాన్‌చెరు : సీఎం రేవంత్ రెడ్డిని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి హైదరాబాద్‌లోని మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గానికి గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులను విడుదల చేయాలని, రిజిస్ట్రేషన్ కార్యాలయం, ఆర్డీఓ కార్యాలయం, పాలిటెక్నిక్ కళాశాలకు సంబంధించిన జీఓలను అమలు చేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. గూడెం తోపాటు ఆయన సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి కుమారులు సందీప్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి సీఎంను కలిశారు.

పందుల యజమానులకు నోటీసులు

- 'సాక్షి' ఫోన్‌ఇన్‌కు స్పందన



పందుల యజమానులకు నోటీసులు అందజేస్తున్న అధికారి

సాక్షి ఎఫెక్ట్

నారాయణఖేడ్: ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని పందుల యజమానులకు గురువారం మున్సిపల్ శానిటరీ అధికారి శ్రీనివాస్ నోటీసులు అందజేశారు. 'సాక్షి' దినపత్రిక ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమంలో అత్యధికంగా పట్టణ వాసులు పందుల సమస్యను ఏకరవు పెట్టారు. వీటి తరలింపునకు చర్యలు చేపడతామని కమిషనరు జగ్జీవన్ హామీ ఇచ్చారు. నిబంధనల ప్రకారం పందుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. వారం రోజులలోపు పందులను ఇతర ప్రాంతాలకు తరలించాలని, లేనిపక్షంలో యజమానులపై చర్యలు తీసుకుంటామని నోటీసుల్లో స్పష్టం చేశారు.

ఉచిత పాస్ ఇవ్వాలని వినతి

పటాన్‌చెరు టౌన్: టోల్‌ప్లాజా 20 కిలోమీటర్ల రేడియస్‌లో ఉన్నవారికి ఉచిత కార్‌పాస్ ఇవ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి కోరారు. ఈ సందర్భంగా గురువారం గుమ్మడిదల నేషనల్ హైవే టోల్ ప్లాజా యాజమాన్యానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... జిన్నారం, గుమ్మడిదల మండలం ప్రజలకు నేషనల్ హైవే లా గెజిటెడ్ ప్రకారం ఫోర్‌వీలర్లకు ఉచిత పాస్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ అంజిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, గిద్దె రాజు, రాజశేఖర్ రెడ్డి, మాణిక్‌రావు శ్రీనివాస్ గుప్తా పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

'సహకార' రైతుకు మొండిచేయి!



సదాశివపేట సహకార సంఘం (పీఏసీఎస్) పరిధిలో మొత్తం 107 మంది రైతులు రెండో విడత (రూ.1.50 లక్షల లోపు) రుణమాఫీకి అర్హులుగా ఉన్నారు. కానీ ఇందులో కేవలం 65 మంది రైతులకు మాత్రమే రెండో విడతలో రుణమాఫీ అయింది. వివిధ కారణాలతో మిగిలిన 42 మంది రైతులకు సంబంధించిన రుణాలు మాఫీ కాలేదు. దీంతో వీరంతా తమ లోన్లు ఎందుకు మాఫీ కాలేదంటూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. సాక్షిప్రతినిధి, సంగారెడ్డి :

- ఉమ్మడి డీసీసీబీ పరిధిలో అర్హులైన రైతులు 8,820 మంది
- మాఫీ కావాల్సింది రూ.108 కోట్లు
- మాఫీ అయింది 6,258 మందికే..
- అధికారుల చుట్టూ ప్రదక్షిణలు



రెండు విడతల్లోనూ ఇదే పరిస్థితి..

జిల్లాలో సహకార సంఘాల పరిధిలోని అర్హులైన రైతులకు రెండో విడత పంట రుణాల మాఫీ ప్రక్రియలో నిరాశే ఎదురైంది. ఒక్కో సహకార సంఘం పరిధిలో పదుల సంఖ్యలో రైతులకు రుణమాఫీ వర్తించలేదు. దీంతో తమ రుణాల పరిస్థితి ఏంటని ఈ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా సొసైటీల పరిధిలో సుమారు 55 శాతం నుంచి 60 శాతం వరకు రైతులకు మాఫీ వర్తించకపోవడం గమనార్హం.

- ఉమ్మడి మెదక్ డీసీసీబీ పరిధిలో రెండో విడత మాఫీకి (రూ.లక్ష నుంచి రూ.1.50 లక్ష లోపు పంటరుణం తీసుకున్న) అర్హులైన రైతులు 8,820 మంది ఉన్నారు. వీరికి రూ.108 కోట్లు మాఫీ కావాలి. ఇందులో కేవలం 6,258 మంది రైతులకు మాత్రమే రూ.50.38 కోట్లు రుణమాఫీ అయింది. మిగిలిన 2,562 మంది అర్హులైన రైతులకు సంబంధించి సుమారు రూ.58 కోట్లు రుణాలు మాఫీ కాలేదు. దీంతో మాఫీ కాని రైతులు బ్యాంకులు, వ్యవసాయశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు.
- ప్రభుత్వం రెండు రోజుల క్రితం రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షలలోపు పంట రుణాలున్న రైతులకు సంబంధించిన రుణాలను మాఫీ చేసిన విషయం తెలిసిందే. జిల్లాలో రెండో విడతలో 27,249 మంది రైతులకు సంబంధించిన పంట రుణాలు రూ.286.76 కోట్లను వారి ఖాతాల్లో జమ చేసినట్లు అధికారులు ప్రకటించారు. అలాగే జూలై 18న రూ.లక్ష లోపు పంట రుణమాఫీ ప్రక్రియలో జిల్లాలో 51,167 మంది రైతులకు సంబంధించి రూ.279.62 కోట్లు రుణమాఫీ అయిన విషయం విదితమే. అయితే ఈ రెండు విడతల్లోనూ సహకార సంఘాల పరిధిలో ఉన్న వందలాది మంది రైతుల రుణాలు మాఫీ కాలేదు.

మాఫీ ఎందుకు కాలేదో తెలుస్తలే



నాకు ఒకటిన్నర ఎకరాల భూమి ఉంది. దీనిపై రూ.లక్ష పంట రుణం తీసుకున్న. రెండు విడతల్లోనూ ఈ రుణం మాఫీ కాలేదు. ఎందుకు కాలేదో అర్థం కావడం లేదు. బ్యాంకుకు వెళ్లి అడిగితే వ్యవసాయశాఖ అధికారుల వద్దకు వెళ్లమంటున్నారు. అధికారులు స్పందించి రుణమాఫీ చేసి న్యాయం చేయాలి.

చిల్వేరి రాములు,
రైతు, వెంకటపూర్, సదాశివపేట సొసైటీ

రైతుల వివరాలన్నీ పంపాం

డీసీసీబీలో పంట రుణాలు పొందిన రైతులందరి వివరాలను ప్రభుత్వానికి పంపాం. కానీ కొందరికి రుణమాఫీ డబ్బులు జమ కాలేదు. వ్యవసాయ శాఖ అధికారుల వద్దకు వెళితే రుణమాఫీ కాకపోవడానికి గల కారణాలను వివరిస్తున్నారు. కొందరు రైతుల ఆధార్ కార్డులో ఉన్న పేర్లకు, బ్యాంక్ ఖాతాలో ఉన్న పేర్లకు తేడా ఉంటే సరిచేసి పంపాం.

– శ్రీనివాస్, డీసీసీబీ, సీఈఓ

'నిమ్జ్'కు మరో 2వేల ఎకరాలు

- న్యాల్‌కల్ మండల పరిధిలో భూసేకరణ
- భూములు పరిశీలించిన కలెక్టర్
- పరిశ్రమల ఏర్పాటుతో 2లక్షల మందికి ఉపాధి



డప్పూర్ గ్రామ శివారులో భూసేకరణకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

న్యాల్‌కల్(జహీరాబాద్): నిమ్జ్(జాతీయ ఉత్పాదక మండలి) ప్రాజెక్టులో పరిశ్రమల ఏర్పాటు కోసం భూసేకరణ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ ప్రాజెక్టు కోసం భూసేకరణ చేపట్టేందుకు ఇప్పటి వరకు 17 గ్రామాలను ఎంపిక చేసిన విషయం తెలిసిందే. తాజాగా మరో మూడు గ్రామాలలో భూసేకరణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2013లో నిమ్జ్ ప్రాజెక్టు కోసం 12,635 ఎకరాలను సేకరించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడతలో ఝరాసంగం మండల పరిధిలోని ఎల్గోయి, బర్దీపూర్, చీలపల్లి, న్యాల్‌కల్ మండల పరిధిలోని రుక్మాపూర్, ముంగి, ముంగి తండాలను ఎంపిక చేసి వాటి పరిధిలో 4,462 ఎకరాలు భూసేకరణ లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండవ విడతలో మండలంలోని న్యామతాబాద్, గంగ్వార్, గణేష్‌పూర్, రేజింతల్, మామిడ్గి, గుంజోటి, హద్నూర్, మొల్కన్‌పాడ్, కల్బెమల్, హుస్సెళ్లి, మెంటల్‌కుంట,బసంత్‌పూర్ గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల పరిధిలో 8,172 ఎకరాల భూసేకరణ లక్ష్యంగా నిర్ణయించారు. ఝరాసంగం మండలంలోని మూడు గ్రామాలు, న్యాల్‌కల్ మండల పరిధిలోని 12 గ్రామాల్లో 12,635 ఎకరాల భూసేకరణ లక్ష్యం కాగా ఇప్పటి వరకు సుమారు 6 వేల ఎకరాల వరకు భూసేకరణ పూర్తయినట్లు సమాచారం. ఈ మధ్య కాలంలో భూసేకరణ వేగవంతం కావడంతో పాటు 65 నెంబరు జాతీయ రహదారి నుంచి రుక్మాపూర్ వరకు పెద్ద ఎత్తున రోడ్డు నిర్మాణం చేపట్టారు. పరిశ్రమల ఏర్పాటు కోసం శంకుస్థాపనలు కూడా జరగడం, త్వరలో ముఖ్యమంత్రి మరో కంపెనీ ఏర్పాటుకు శంకుస్థాపన చేసే అవకాశం ఉందని సమాచారం. ఈ ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటు వల్ల లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

మరో 2 వేల ఎకరాల సేకరణ

ఝరాసంగంలోని మండలంలోని మూడు, న్యాల్‌కల్ మండల పరిధిలోని 14 గ్రామాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ముమ్మర చర్యలు చేపట్టింది. ఇందుకోసం మరో రెండు వేల ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించింది. న్యాల్‌కల్ మండల పరిధిలోని వడ్డి, మల్గి, డప్పూర్ గ్రామాల్లో ఈ భూమిని సేకరించేందుకు చర్యలు చేపట్టారు. ఈ గ్రామాల పరిధిలో 1200 ఎకరాల ప్రభుత్వ భూమి, 800 ఎకరాల్లో పట్టా భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. గురువారం డప్పూర్, మల్గి గ్రామాల శివారులోని భూములను కలెక్టర్ క్రాంతి పరిశీలించారు. మూడు గ్రామాల పరిధిలో ప్రభుత్వ భూమెంత? పట్టా భూమెంత? ఉందని అధికారులను అడిగి తెలుసుకున్నారు. భూసేకరణ సర్వే తదితరాలు ఎప్పటికి పూర్తి చేస్తారని ఆమె ప్రశ్నించారు. ఇటీవల వర్షాలకు సర్వే పనుల్లో కొంత జాప్యం జరిగిందని, 20 రోజుల్లోపు పూర్తి చేస్తామని ఆర్డీఓ రాజు కలెక్టర్‌కు వివరించారు.

ఝరాసంగం మండలంలో..

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ నిమ్జ్‌లో ఏర్పాటవుతున్న వెమ్ టెక్నాలజీస్ పరిశ్రమ కోసం కేటాయించిన భూములను కలెక్టర్ క్రాంతి సందర్శించారు. గురువారం మండల పరిధిలోని చీలపల్లి, చీలపల్లి తండా, ఎల్గోయి గ్రామ శివారులలో ఉన్న నిమ్జ్ పరిసరాలను వెమ్ పరిశ్రమ ఎండీ వెంకటరాజుతో కలిసి వెళ్లి చూశారు. ఆ భూమికి సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు. అయితే రెండవ విడతలో చిల్లపల్లి తండా, ఎల్గోయి గ్రామంలో ఉన్న కొద్దిపాటిని ప్రాజెక్టు కోసం తీసుకోవద్దని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమాల్లో టీఎస్ఐఐసీ మేనేజర్‌తో పాటు నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్లు నాగలక్ష్మి, రవీందర్‌రెడ్డి, సర్వే అండ్ ల్యాండ్ ఏడీ ఐనేష్, డిప్యూటీ సర్వేర్ భిక్షపతి, తహసీల్దార్ రాజిరెడ్డి, సర్వేర్ లాల్‌సింగ్, జహీరాబాద్ ఆర్డీఓ రాజు, పంచాయతీరాజ్ అధికారి జగదీశ్వర్ పాల్గొన్నారు.

66 మంది బాల కార్మికులకు విముక్తి

పిల్లలతో పనిచేయిస్తున్న 23 మందిపై కేసు

సంగారెడ్డి : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ ఏర్పాటు చేశామని ఎస్పీ రూపేష్ తెలిపారు. గురువారం ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 66 మంది బాల కార్మికులకు విముక్తి కలిగించామని, పిల్లలను పనిలో పెట్టుకున్న 23 మందిపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎస్పీ తన కార్యాలయంలో మాట్లాడారు. జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ పేరుతో ప్రతీ ఏడాది రెండు నెలల పాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని పేర్కొన్నారు. జూలై 1 నుంచి 31 వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా పోలీసు శాఖ, చైల్డ్ లేబర్, సీడబ్ల్యూసీ, డీసీపీయూ విద్యాశాఖ, చైల్డ్‌కేర్ ఇనిస్టిట్యూట్ మొదలైన శాఖల అధికారులు, సిబ్బంది భాగస్వామ్యమయ్యారు. బాల కార్మికులు గురించి తెలిస్తే చైల్డ్‌లైన్ నంబర్ 1098, డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టండి



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి లలితకుమారి

కంది(సంగారెడ్డి) : గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారి, మండల ప్రత్యేకాధికారి లలితకుమారి సూచించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సీజనల్ వ్యాధుల నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రతలపై పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో మురుగు నిల్వకుండా చూసుకోవాలన్నారు. అలాగే తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లీనింగ్ చేయించాలని ఆదేశించారు. ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి వ్యాధులపై సర్వే నిర్వహించి, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని చెప్పారు. అంతకుముందు కవలంపేటలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మహేందర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నాగపురి పాఠశాలను సందర్శించిన అందెశ్రీ

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని నాగపురి ఉన్నత పాఠశాలను గురువారం అందెశ్రీ సందర్శించారు. హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థిని ఆహ్వానం మేరకు పాఠశాలకు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన్మనిచ్చిన తల్లితండ్రులు, విద్య నేర్పిన గురువులను గౌరవించాలన్నారు. చదువుకు మించిన ఆస్తి, సంపద సృష్టిలో లేదన్నారు. నాకు చదువు లేక పోయినా ప్రకృతినే గురువుగా భావించి కృషితో ఈ స్థాయికి వచ్చానన్నారు. జయ జయహే తెలంగాణ రాష్ట్ర గీతంగా ప్రకటించిన తరువాత మొదటి సారి నాగపురి పాఠశాలకు అందె శ్రీ రావడం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఐలయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ప్రశాంతత



క్రీడలను ప్రారంభించిన జిల్లా జడ్జి భవానిచంద్ర

సంగారెడ్డి టౌన్ : క్రీడలతో మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానిచంద్ర అన్నారు. గురువారం పట్టణంలోని జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం న్యాయ సమస్యలపై పోరాడే న్యాయవాదులు క్రీడలు ఆడటం వల్ల ఒత్తిడి నుంచి దూరం చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా జడ్జిలు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ సత్తయ్యగౌడ్

సంగారెడ్డి టౌన్ : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సంగారెడ్డి డీఎస్పీ సత్తయ్య గౌడ్ సూచించారు. గురువారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ అమ్మినా.. కొన్నా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్, కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం, సీఐటీయూ నాయకులు యాదగిరి, అశోక్ శివ పాల్గొన్నారు.

5 నుంచి 'స్వచ్ఛదనం..పచ్చదనం'

సంగారెడ్డి టౌన్ : వివిధ జిల్లాల కలెక్టర్లతో గురువారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ క్రాంతి మాట్లాడారు. ఈనెల 5 నుంచి 9 వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో నిర్వహించనున్న 'స్వచ్ఛదనం పచ్చదనం' కార్యక్రమంలో ప్రజలను భాగ్యస్వామ్యం చేసి విజయవంతం చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, ట్రైన్ కలెక్టర్ మనోజ్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక ఆదాయం

జహీరాబాద్ టౌన్: ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. కోహీర్ మండలం కొత్తూర్(బి) గ్రామ శివారులో గోద్రెజ్ ఆగ్రోవెట్ సంస్థ ఏర్పాటు చేసిన అయిల్‌పామ్ నర్సరీని గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయిల్‌పామ్ మొక్కలు, డ్రిప్ తదితర ఖర్చులకు ఎకరానికి రూ.50 వేల సబ్సిడీ లభిస్తుందన్నారు. జిల్లాలో 3 వేల ఎకరాల్లో సాగు లక్ష్యం కాగా 900 ఎకరాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. ప్రస్తుతం 700 ఎకరాల్లో పంట సాగవుతుందని చెప్పారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకంలో భాగంగా పండ్ల తోటల సాగుకు రైతులు ముందుకు రావాలన్నారు. ఈ పథకం కింద జిల్లాలో 340 ఎకరాల లక్ష్యంగా కాగా, ఇప్పటి వరకు 100 ఎకరాల్లో పండ్ల తోటలు వేయడం జరిగిందన్నారు. హార్టికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ సోమేశ్వరరావు, ఆర్డీఓ రాజు, తహసీల్దార్ బాల శంకర్, స్వీటి, పవన్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మునిపల్లి(అందోల్): సమస్య ఏదైనా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలి కానీ, ధర్నాలు చేయొద్దని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. లింగంపల్లి గురుకుల పాఠశాలను ఆమె సందర్శించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు చెప్పారు.

పెండింగ్ వేతనాలివ్వాలని నిరసన



ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

జహీరాబాద్ టౌన్: పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆస్పత్రి వద్ద గురువారం కాంట్రాక్టు కార్మికులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా రెగ్యులర్‌గా జీతాలు రావడం లేదని ఆరోపించారు. ప్రతీ నెల 7వ తేదీలోపు జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆందోళన విరమించాలని సూచించిన సూపరింటెండెంట్ శ్రీధర్‌తో కార్మికులు వాగ్వాదానికి దిగారు. అక్కడి నుంచే ఆయన కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడటంతో.. రాత్రి వరకు జీతాలు చెల్లిస్తామని చెప్పాడు. కార్యక్రమంలో ఎలిషా, పవన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్‌గిరిపై గురి

'ఖేడ్' మార్కెట్ పీఠం కోసం తీవ్ర పోటీ

- పదవులు దక్కించుకునేందుకు ముమ్మర యత్నాలు
- ఎస్సీ సామాజిక వర్గానికి రిజర్వు
- పార్టీ విధేయుల వైపు అధినాయకత్వం చూపు

నారాయణఖేడ్: ఖేడ్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని దక్కించుకోవడానికి చాలామంది ఆశావహులు పోటీ పడుతున్నారు. ఈసారి చైర్మన్‌గిరి ఎస్సీ జనరల్‌కు రిజర్వు కావడంతో ఆ సామాజిక వర్గంలోని కాంగ్రెస్ నాయకులు పదవిని దక్కించుకునేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఖేడ్‌లో వ్యవసాయ మార్కెట్ కమిటీని ఏర్పాటుచేసిన అనంతరం మొదటి సారిగా ఎస్సీ సామాజిక వర్గానికి చైర్మన్ పదవి రిజర్వు అయ్యింది. 1994కు పూర్వం జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో నారాయణఖేడ్ ప్రాంతం ఉండేది. మార్కెట్ కమిటీల విభజన సందర్భంగా అప్పటి ఎమ్మెల్యే స్వర్గీయ కిష్టారెడ్డి కృషి ఫలితంగా ఖేడ్‌కు ప్రత్యేకంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ మంజూరైంది. అప్పటినుంచి ఓసీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వారు చైర్మన్లుగా నియమితులయ్యారు.

ఎవరి ప్రయత్నాల్లో వారు..

ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉంది. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి, ఎంపీ సురేశ్ షెట్కార్‌లు కొనసాగుతున్నారు. అయితే ఆ పార్టీకి చెందిన ఎస్సీ సామాజిక వర్గం నాయకులు పదవి కోసం ఇరువురు నేతలను ప్రసన్నం చేసుకోవడానికి ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. ముఖ్యంగా చైర్మన్ పదవి కోసం కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన దేవిదాస్, కంగ్టి మండలం చీమల్‌పాడ్‌కు చెందిన మాజీ జెడ్పీటీసీ రవి, మనూరు మండలం శెల్గిరకు చెందిన మాజీ జెడ్పీటీసీ పురంజన్, ఖేడ్ మండలం జి.హుక్రానకు చెందిన అమృత్, సంజీవన్‌రావుపేటకు చెందిన సాయిలు, కల్హేర్ మండలం బీబీపేటకు చెందిన బండారు సాయిలు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ సంజయ్, నాగల్గిద్ద మండలం ఎర్రబొగుడకు చెందిన స్వామిదాస్ తదితరులు పదవిని దక్కించుకునేందుకు ముమ్మరంగా యత్నిస్తున్నారు. నాటి టీడీపీ కంచుకోటగా ఉన్న కల్హేర్ మండలం కృష్ణాపూర్‌కు చెందిన దేవిదాస్, అతని తండ్రి ఆగమయ్యల కుటుంబం అనాదిగా కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పని చేస్తుంది. దేవిదాస్ దివంగత ఎమ్మెల్యే కిష్టారెడ్డికి అనుచరుడిగా పని చేయడమే కాకుండా కల్హేర్ మండలంతో పాటు, కృష్ణాపూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి ఎంతగానో కృషి చేశారు. జి.హుక్రానుకు చెందిన అమృత్ సైతం కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల కార్యకర్తగా పనిచేస్తున్నాడు. పార్టీ అధిష్టానం మాత్రం నారాయణఖేడ్‌లో ఉపఎన్నికలు జరిగిన కష్టకాలంలో పార్టీని వీడకుండా పార్టీ జెండామోసిన వారికే చైర్మన్ పదవిని కట్టబెట్టాలనే ఆలోచనతో ఉన్నట్లు తెలుస్తుంది.



వ్యవసాయ మార్కెట్ కమిటీ

ఆశావహులు ఎక్కువే..

రెండేళ్ల పదవీకాలం ఉన్న మార్కెట్ కమిటీ పాలకవర్గం 18మందితో ఏర్పాటు కానుంది. చైర్మన్, డైరెక్టర్ల పదవులు ఆశిస్తున్నవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుంది. వీరంతా ఎమ్మెల్యే, ఎంపీల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఆశావాహులు అధికంగా ఉండటంతో చైర్మన్ పదవి ఎవరిని వరిస్తుందోనని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.

క్లుప్తంగా

చెప్పినట్లుగా రుణమాఫీ చేశాం

• టీపీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేయలేని రుణమాఫీ ఎనిమిది నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. చేగుంట ఏపీజీబీవీ బ్యాంక్‌కు సంబంధించిన రుణమాఫీ పత్రాలను ఆయన చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం పదేళ్ల పాటు మాటలతోనే కాలం గడిపిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించి రూ.36 వేల కోట్లతో విడతల వారీగా రుణమాఫీ చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పెంటారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ రాంరెడ్డి, రావిపల్లి శ్రీధర్‌రెడ్డి, మధుసూదన్ తిరుమలేశ్, వెంకట్‌రెడ్డి, బాలకృష్ణ, సత్యనారాయణ, ఎల్లంతో పాటు రైతులు పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై..

• గౌరారం ఎస్సై సస్పెన్షన్

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం గౌరారం ఎస్సై జె.శివకుమార్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఆయనపై పోలీసు డిపార్ట్‌మెంట్ సీసీఏ రూల్స్ అతిక్రమణ, అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పోలీసు ఉన్నతాధికారులు విచారణ జరిపారు. విచారణ నివేదిక అనంతరం మల్టీజోన్1, రాజన్న జోన్ 3 ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఎస్సైను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ అనురాధ ఓ ప్రకటన ద్వారా తెలిపారు. పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణారాహిత్యానికి పాల్పడే అధికారులను, సిబ్బందిని ఉపేక్షించబోనని హెచ్చరించారు.

గంజాయి విక్రేత అరెస్ట్

చేర్యాల(సిద్దిపేట): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కి పంపినట్లు ఎస్‌ఐ దామోదర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. జనగామ జిల్లా బచ్చన్నపేట గ్రామానికి చెందిన కొల్లూరి సంజీవ్‌కుమార్ మండల పరిధిలోని వీరన్నపేట గ్రామ శివారులో గంజాయి విక్రయిస్తున్నాడు. నమ్మదగిన సమాచారం మేరకు గురువారం ఉదయం వెళ్లి తనిఖీలు చేపట్టి 175 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

గృహిణి ఆత్మహత్య..

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : గృహిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన కొల్లూరు పోలీసు స్టేషన్ పరిధిలో సైబర్‌కాలనీలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన హారతి(25)కి అదే ప్రాంతానికి చెందిన శంబునాథ్‌తో 2001లో వివాహం జరిగింది. ఉద్యోగరీత్యా గతేడాది తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సైబర్‌కాలనీకి వచ్చి నివాసం ఉంటున్నారు. వీరికి రెండేళ్ల కుమారుడు ఉండగా పుట్టు వెంట్రుకలు సందర్భంగా శంబునాథ్ బంగారు లాకెట్ చేయించాడు. లాకెట్‌పై తన తల్లిదండ్రుల పేర్లు పెట్టాలని హారతి భర్తతో వాగ్వాదం చేసింది. బుధవారం రాత్రి ఇంట్లో సామగ్రి తెవడంకోసం భర్త బయటకు వెళ్లగా కుమారుడుని మంచిగా చూసుకోమని మెసేజ్ చేసి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురి రిమాండ్

పటాన్‌చెరు టౌన్ : పాతకక్షలు మనసులో పెట్టుకొని హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన పటాన్‌చెరు పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. పటాన్‌చెరులో మూడు రోజుల కిందట నిర్వహించిన బోనాల పండుగ సందర్భంగా తిమ్మక్కచెరువు వద్దకు కొంత మంది యువకులు చేరారు. ఇందులో ఉదయకిరణ్, సందీప్, ప్రసన్న కుమార్ పాత కక్షలు మనసులో పెట్టుకొని సాయితేజ్ అనే యువకుడిపై దాడి చేశారు. అడ్డు వెళ్లినందుకు వినోద్ అనే యవకుడిని బీరుసీసా పగులగొట్టి హత్యాయత్నానికి పాల్పడ్డారు. సాయితేజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిని అరెస్ట్ చేసి గురువారం రాత్రి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ ఆసీఫ్ అలీ తెలిపారు.

పనిలో కాదు బడిలో..

ఆటపాటలతో సందడి చేసే వయసు. బడికి వెళ్లి చదువుకోవాల్సిన బాల్యం పరిశ్రమలు, హోటళ్లు, ఇటుక బట్టీల్లో పనికి చేరుతూ శ్రమ దోపిడీకి గురవుతున్నారు. ఇలాంటి వ్యవస్థను రూపుమాపేందుకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకొచ్చాయి. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ పేరుతో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ప్రతీ సంవత్సరం జనవరిలో ఆపరేషన్ స్మైల్, జూలై నెలలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం నిర్వహిస్తుంది. జూలై 1 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ -10లో పలువురు బాల కార్మికులను గుర్తించి విముక్తి కల్పించారు.

– సిద్దిపేటకమాన్



ముగిసిన ఆపరేషన్ ముస్కాన్ 10

- నెల రోజులపాటు జిల్లాలో తనిఖీలు
- 143 మంది బాల కార్మికులను గుర్తింపు
- తల్లిదండ్రులు, యజమానులకు కౌన్సిలింగ్
- సత్ఫలితాలనిస్తున్న కార్యక్రమం

జిల్లాలో పోలీసు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, కార్మిక, వైద్యారోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ ముస్కాన్ నిర్వహించారు. ఇందులో భాగంగా అధికారులు దాడులు నిర్వహించి హోటళ్లు, బేకరీలు, ఇటుక బట్టీలు, కిరాణ దుకాణాలు, పలు ప్రాంతాల్లో పని చేస్తున్న 143 మంది బాల కార్మికులను గుర్తించి వారిని రక్షించి, పని నుంచి విముక్తి కల్పించారు. అనంతరం తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించి వారికి అప్పగించారు. జిల్లాలో పోలీసుశాఖ నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం సత్ఫలితాలనిస్తున్నాయి.

ఆర్థిక ఇబ్బందులతో..

చదువుకునే వయస్సులో వివిధ కారణాలతో చిన్నారులు బాల కార్మికులుగా మారుతున్నారు. ముఖ్యంగా నిరక్షరాస్యత, ఆర్థిక ఇబ్బందులతో హోటళ్లు, దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాల్లో పని చేస్తున్నారు. నిర్వాహకులు బాల కార్మికులకు నెల నెలా వేతనం చెల్లించడంతోపాటు భోజనం పెట్టడంతో తల్లిదండ్రులు మొగ్గు చూపుతున్నారు.

143 మందిని గుర్తింపు

బడీడు పిల్లలను గుర్తించి వారిని బడిలో చేర్పించే విధంగా జిల్లాలో పోలీసు, కార్మిక, స్త్రీ శిశు సంక్షేమ, విద్య, చైల్డ్ ప్రొటెక్షన్, వైద్యారోగ్యశాఖ అధికారులు జూలై 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్ 10 కార్యక్రమాన్ని నిర్వహించింది. నెల రోజులపాటు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, చత్తీస్‌గఢ్, బీహార్, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్, మేఘాలయ రాష్ట్రాలకు చెందిన పిల్లలు జిల్లాలోని పలు హోటళ్లు, బేకరీలు, ఇటుక బట్టీలు, కిరాణం షాప్‌లలో మెకానిక్ షాప్‌లలో బాల కార్మికులుగా పని చేస్తున్నట్లు గుర్తించారు. వీరితో పని చేయించుకుంటున్న 11 మంది యజమానులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మరికొంత మంది యజమానులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. తల్లిదండ్రులు లేని పిల్లలు ఉన్నట్లు గుర్తిస్తే వారిని బాల సదనంలో అప్పగించారు. జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం అవడానికి నోడల్ అధికారి, అడిషనల్ డీసీపీ మల్లారెడ్డి, మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గ ప్రతి రోజూ మానిటర్ చేసినట్లు అధికారులు తెలిపారు. వివిధ శాఖల అధికారులను, పోలీసు అధికారులను సీపీ అనురాధ అభినందించారు.

డివిజన్‌ల వారీగా వివరాలు..

బాల కార్మికులుగా గుర్తించి కాపాడిన వారిలో సిద్దిపేట డివిజన్‌లో 101 మంది వీరిలో 85 మంది మగపిల్లలు, 16 మంది ఆడపిల్లలు, గజ్వేల్ డివిజన్ పరిధిలో 30 మంది వీరిలో 25 మంది మగ పిల్లలు, ఐదుగురు ఆడపిల్లలు, హుస్నాబాద్ డివిజన్ పరిధిలో 12 మంది వీరిలో 11 మంది మగ పిల్లలు, ఒక చిన్నారి ఉన్నారు. అదే విధంగా జిల్లాలో గతేడాది నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో 48మంది బాల కార్మికులను గుర్తించి కాపాడినట్లు పోలీసు అధికారులు తెలుపుతున్నారు.



ఆపరేషన్ ముస్కాన్‌లో బాల కార్మికులను గుర్తించిన అధికారులు (ఫైల్)

పిల్లలను పనిలో పెట్టుకోవద్దు



జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులతో పని చేయించినట్లు కనబడితే వెంటనే డయల్ 100కు కాల్ చేసి, సిద్దిపేట పోలీసు కమిషనరేట్ కంట్రోల్ రూమ్ 87126 67100కు సమాచారం అందించాలి. బాల కార్మికులతో పని చేయించినట్లు గుర్తిస్తే వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటాం. గత నెలలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్‌లో 143 మంది బాల కార్మికులను గుర్తించడం జరిగింది. బాల కార్మికులను, చిన్నారులను పనుల్లో పెట్టుకోకూడదు. అలా చేసే వారిపై చర్యలు తప్పవు.

– అనురాధ, సిద్దిపేట సీపీ

దోమల నివారణకు చర్యలు

- మరో 11 జ్వర కేసులు
- మలేరియా శాఖ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో దోమల నివారణకు చర్యలు చేపట్టడం ద్వారా మలేరియా, డెంగ్యూ వ్యాధులను నివారించొచ్చని మలేరియా శాఖ రాష్ట్ర అసిస్టెంట్ డైరెక్టర్ నాగయ్య సూచించారు. చిన్నశంకరంపేట మండలంలోని సూరారం గ్రామంలో డెంగ్యూతో విద్యార్థి మృతి చెందడంతో మూడు రోజులుగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం గ్రామంలోని మురికి కాల్వలు, నీటి నిలువ ఉండే ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. డ్రమ్స్, కుండీలు, టైర్లు, ప్లాస్టిక్ డబ్బాలు, కూలర్‌లోని నీటి నిల్వ ఉండే ప్రదేశాల్లో ఏసీడీ దోమల లార్వా వృద్ధి చెందుతాయన్నారు. సూరారం గ్రామంలో నమూనాలు పరిశీలించగా ఒకటి రెండు ప్రాంతాల్లో ఇలాంటి లార్వా ఉన్నప్పటికీ కాదన్నారు. ఈ సందర్భంగా ఆరోగ్య శిబిరంలోని రికార్డులు పరిశీలించి వైద్యాధికారి సాయి సింధుకు పలు సూచనలు చేశారు.



దోమల లార్వాను పరిశీలిస్తున్న నాగయ్య, వైద్య సిబ్బంది

22కు చేరిక జ్వర బాధితులు

సూరారం హెల్త్ క్యాంపులో 121 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 11 మందికి జ్వరం ఉన్నట్లు గుర్తించారు. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న వారి సంఖ్య 22కు చేరింది. వైద్య శిబిరంలో మలేరియా జిల్లా అధికారి వజేందర్, రమేశ్, డాక్టర్ హృదయ్, నందిని, సీహెచ్ఓ యాదగిరిరావు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు ఉన్నారు.

ఫైలేరియా నిర్మూలనకు సమష్టి కృషి



అవగాహన కల్పిస్తున్న వైద్య బృందం

- జిన్నారం మండలంలోని సోలక్‌పల్లిలో ఢిల్లీ డాక్టర్ల బృందం పర్యటన

పటాన్‌చెరు టౌన్: జిన్నారం మండల పరిధిలోని సోలక్‌పల్లిలో గురువారం ఢిల్లీ డాక్టర్ల జస్టిన్ బృందం, జోనల్ డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్, జిన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కోమల్ తారక్ ఆధ్వర్యంలో ఎండీఏ ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. జాతీయ ఫైలేరియా నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం నేపథ్యంలో ఇంటింటికీ తిరుగుతూ వీధుల్లో వాడల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు మాట్లాడుతూ.. ఫైలేరియా నిర్మూలనకు సమష్టి కృషి అవసరమన్నారు. జిల్లా పరిధిలోని బొల్లారం జిన్నారం, గుమ్మడిదల, కానుకుంట, పటాన్‌చెరు, భానూర్ తదితర ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఫైలేరియా నిర్మూలన కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 10 11,12 తేదీల్లో విస్తృతస్థాయి కార్యక్రమాలు, ఫైలేరియా నిర్మూలన మాత్రల పంపిణీ, వాటి వినియోగం లాంటి అంశాలపై అవగాహన నిర్వహిస్తామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు మాత్రలను వేసుకోవద్దన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బాలరాజ్, జిన్నారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య బృందం సిబ్బంది అనురాధ, ఆశ వర్కర్లు, నాజియా, నాగమణి ,గ్రామస్తులు పాల్గొన్నారు.

నడుచుకుంటూ వెళ్తుండగా ఢీకొట్టిన క్రేన్

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి



ప్రమాద స్థలంలో అఖిల మృతదేహం

పటాన్‌చెరు టౌన్ : నడుచుకుంటూ వెళ్తున్న యువతిని క్రేన్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కుర్షిద అలీ కథనం మేరకు.. సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం బ్రహ్మంగారి తండాకు చెందిన సురేశ్ కూతురు అఖిల(20) పటాన్‌చెరు శివారులోని వాల్యూమార్ట్ ప్రమోటర్ గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. గురువారం ఉదయం గ్రామం నుంచి డ్యూటీకి బయలుదేరి ఉదయం 11 గంటల సమయంలో పటాన్‌చెరులో బస్సు దిగి రోడ్డు దాటింది. సర్వీస్ రోడ్డు మీదుగా వాల్యూమార్ట్‌కి వెళ్తుండగా అదే సమయంలో జాతీయ రహదారిపై రాంగ్ రూటులో వచ్చిన క్రేన్ అఖిలను ఢీకొట్టింది. ఆమె తలపై నుంచి వాహనం వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి తండ్రి సురేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రైల్వే స్టేషన్‌కు వెళ్తుండగా వృద్ధురాలు..

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందిన ఘటన రామచంద్రాపురం పట్టణంలోని లింగంపల్లి చౌరస్తాలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని రాఘవేంద్రకాలనీలో నివాసం ఉండే సునీల్ గురువారం ఉదయం అత్తగారిని లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో దింపడానికి బైక్‌పై బయలుదేరాడు. లింగంపల్లి చౌరస్తా వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను టిప్పర్ డ్రైవర్ వేగంగా వచ్చి ఢీకొట్టి ఈడ్చుకెళ్లాడు. ఈ ప్రమాదంలో వృద్ధురాలు నిర్మల అక్కడికక్కడే మృతి చెందగా, సునీల్ తీవ్ర గాయాలపాలయ్యాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

కౌడిపల్లి(నర్సాపూర్): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ రంజిత్‌కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. మండలంలోని ధర్మాసాగర్‌గేట్ సమీపంలో 765డి జాతీయ రహదారిపై బుధవారం రాత్రి కారు, బైక్ ఢీకొన్న ఘటనలో కొల్చారం మండలం దుంపలకుంట తండాకు చెందిన లంబాడీ గోపిలాల్(42)కు తీవ్రగాయాలైన విషయం విధితమే. బాధితుడిని 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గోపిలాల్(ఫైల్)


విద్యుదాఘాతంతో ఒకరు..

చేగుంట(తూప్రాన్): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని ఇబ్రహీంపూర్‌లో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బెదరబోయిన సంతోష్‌కుమార్(25) ఇంట్లో బల్బు పోవడంతో మరో బల్బు ఏర్పాటు చేస్తున్న క్రమంలో కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామస్తుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ బాలరాజు కేసు నమోదు చేసుకున్నారు. మృతుడికి మూడు నెలల కిందటమే వివాహమైంది.

హామీలు అమలు చేయాలి

• ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, అడివయ్య

మెదక్ కలెక్టరేట్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఎన్‌పీఆర్డీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్, అడివయ్య కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా 7వ మహాసభ నిర్వహించారు జిల్లా కార్యదర్శి కె.యశోద అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో 40 లక్షల మంది దివ్యాంగులుంటే కేవలం 5.75 లక్షల మందికే పెన్షన్లు ఇస్తున్నారని తెలిపారు. పెన్షన్‌ను కూడా రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో మానసిక వైకల్యం కలిగిన విద్యార్థులు 5 లక్షల మంది ఉన్నారని, వీరికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే హక్కు లేకుండా పోతుందన్నారు. మహాసభలో జిల్లా నాయకులు బస్వా రాజు, దుర్గ, ముత్యాలు, యాదగిరి, సంతోష్, చంద్రం, భాగ్యమ్మ, కిష్టయ్య, శ్రీనివాస్, యాదమ్మ, పాపమ్మ, సామెందర్, శ్రీకాంత్, సావిత్రి, లోకేష్, బాలరాజు, రాములు ఆగమయ్య, రాణి, ఆనంద్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్

తహసీల్దార్ కార్యాలయంలో అవినీతి చేపలు

- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జూనియర్ అసిస్టెంట్, ధరణి ఆపరేటర్
- రూ.30 వేల నగదుతో కారు సీజ్

పటాన్‌చెరు టౌన్: అమీన్‌పూర్ తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు చేసి లంచం తీసుకుంటున్న ఇద్దరిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడకు చెందిన వెంకటేశ్ యాదవ్ తన మామ పేరు మీద ఉన్న ఆస్తిని అత్త పేరుపైకి పౌతీ మార్పిడి కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టూ 2021 నుంచి తిరుగుతున్నాడు. ఈ పని కోసం కార్యాలయంలో పనిచేసే ధరణి ఆపరేటర్ అరుణ్ కుమార్(అవుట్ సోర్సింగ్)తో పాటు జూనియర్ అసిస్టెంట్ మన్నే సంతోష్ రూ.30 వేలు లంచం డిమాండ్ చేశారు.దీంతో వెంకటేశ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడు రూ.30 వేలను అరుణ్ కుమార్‌కు చెందిన కారులో పెట్టాడు. కారులోని నగదు తీసుకున్న ధరణి ఆపరేటర్, జూనియర్ అసిస్టెంట్లు ఆన్‌లైన్‌లో పౌతీ మార్పిడి చేశారు. ఏసీబీ అధికారులు ఇద్దరిని పట్టుకొని వారు తీసుకున్న నగదుకు రసాయన పరీక్ష నిర్వహించగా పాజిటివ్ తేలింది. ఈ ఘటన వివరాలను తహసీల్దార్ రాధ ధృవీకరించారు. ఇద్దరిని అరెస్ట్ చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరుస్తామని తెలిపారు. ఏసీబీ దాడుల్లో ఇన్‌స్పెక్టర్ వేణు కుమార్, రమేశ్ ఉన్నారు.



పట్టుబడ్డ నగదుతో అరుణ్ కుమార్, సంతోష్

కంది రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

- రూ.లక్ష కిటికీలోంచి కిందికి పారేసిన సిబ్బంది
- స్వాధీనం చేసుకున్న అధికారులు
- డబ్బు ఎవరిదనే దానిపై ఆరా

కంది(సంగారెడ్డి): కందిలోని రిజిస్ట్రేషన్ జిల్లా కార్యాలయంలో ఏసీబీ అధికారులు గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏసీబీ డీఎస్పీ ఉదయ్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్ నుంచి కార్యాలయానికి చేరుకున్న ఏసీబీ అధికారుల బృందం సోదాలు నిర్వహించింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. తాము కార్యాలయానికి చేరుకోగానే గుర్తు తెలియని వ్యక్తులు కిటికీలో నుంచి రూ.లక్ష బయటకి విసిరి వేయడం జరిగిందన్నారు. ఆ డబ్బును రికవరీ చేసి ఎవరిదై ఉంటుందన్న కోణంలో విచారణ చేస్తున్నామన్నారు. అలాగే రిజిస్ట్రేషన్ అయిన డాకుమెంట్లలో ఏవైనా తప్పులు న్నాయా అన్న విషయాలను కూడా పరిశీలిస్తున్నామని వివరించారు. ఈ సోదాలు రాత్రంతా జరిగే అవకాశం ఉందని పూర్తి వివరాలను శుక్రవారం ఉదయం తెలియజేస్తామని ఏసీబీ అధికారులు వెల్లడించారు.




కందిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం

మూడు దశాబ్దాల పోరాటానికి ఫలితం

- సుప్రీం కోర్టు తీర్పును మేధావులంతా గౌరవించాలి: ప్రొఫెసర్ కాశీం

గజ్వేల్‌రూరల్: పోరాడితే ఫలితం దక్కుతుందనేది సుప్రీం కోర్టు తీర్పుతో రుజువైందని, ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ మూడు దశాబ్దాల పాటు సాగిన దండోరా పోరాటానికి ఫలితం లభించిందని ప్రొఫెసర్ కాశీం పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1996లో ఎస్సీల్లోని 59 కులాలు తమ హక్కుల కోసం, ఎస్సీ వర్గీకరణ గొంతెత్తారని పేర్కొన్నారు. అదే సమయంలో గవర్నర్ ఆర్డినెన్స్ ద్వారా చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణ చేశారని గుర్తు చేశారు. 1999–2004 వరకు ఎస్సీ రిజర్వేషన్ అమలు కాగా… ఈ కాలంలో మాదిగ, ఉప కులాల్లో 23వేల మందికి ఉద్యోగాలు లభించాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో చెన్నయ్య అనే వ్యక్తి ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయొద్దంటూ కోర్టులో కేసు వేయడం వల్ల ఎస్సీ వర్గీకరణ చట్టం రద్దయిందన్నారు. 3 దశాబ్దాలపాటు జరిగిన ఈ ఉద్యమంలో ఆర్టికల్ 431లో వర్గీకరణ చేయకూడదనేది లేదని, బీసీలను ఏ విధంగానైతే వర్గీకరించారో ఎస్సీల్లో ఉప కులాలు మధ్య అంతరాలు పోవాలంటే ఎస్సీ వర్గీకరణ చేయొచ్చని సుప్రీం కోర్టులో ఆరు మంది జడ్జీలు చారిత్రాత్మక తీర్పునిచ్చారని తెలిపారు. ఎస్సీలకు సామాజిక న్యాయం దక్కాలంటే గవర్నర్ నుంచి ఆర్డినెన్స్ తీసుకురావాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పొన్నాల కుమార్, మైన రాములు, ముండ్రాతి కృష్ణ, చేబర్తి యాదగిరి, కృష్ణమూర్తి, సల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం


బీమా.. రైతుకు ధీమా

- 5వ తేదీ వరకు దరఖాస్తుల ఆహ్వానం
- జిల్లాలో 15,982 మంది అర్హులు
- వ్యవసాయ అధికారుల విస్తృత ప్రచారం

దుబ్బాకటౌన్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2018 సంవత్సరంలో రైతు బీమా పథకాన్ని ప్రారంభించింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం సైతం ఈ పథకాన్ని కొనసాగిస్తుంది. రైతు ఏ విధంగా మరణించినా ఈ పథకం వర్తిస్తుంది. బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది. కొత్తగా పాస్ బుక్‌లు పొందిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.


మార్గదర్శకాలు ఇలా..

రైతు బీమాకు సంబంధించి ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. జిల్లాలోని మండలాల్లో గ్రామాల వారీగా ఏఓలు, ఏఈఓలు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు పొంది బీమాలో చేరేందుకు అవకాశం ఉన్న పేర్లను గ్రామాల వారీగా ప్రకటించి దరఖాస్తు చేసుకునేందుకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో జూన్ 28వ తేదీలోపు కొత్తగా పాస్ పుస్తకాలు పొందిన వారు 159,82 మంది రైతులు నమోదుకు అర్హులని అధికారులు తెలుపుతున్నారు. 59 ఏళ్ల దాటిన వారి పేర్లను బీమా నుంచి తొలగిస్తున్నారు. ఈ ఆరేళ్ల కాలంలో జిల్లాలో 5,901 మంది రైతులు వివిధ కారణాలతో మృతి చెందగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం రూ. 5 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించింది.



దౌల్తాబాద్‌లో రైతులను నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న ఏఈఓలు

గడువు దాటితే అవకాశం లేదు



రైతు బీమాకు అర్హులైన వారిని చేర్పించేందుకు గ్రామాల వారీగా రైతుల జాబితాను ఏఈఓలు తమ క్లస్టర్ రైతులకు సమాచారం అందించారు. ఈ నెల 5వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని అవగాహన కల్పిస్తున్నాం. గడువు దాటితే ఏడాది పాటు దరఖాస్తుకు అవకాశం లేదు.

–మహేశ్, జిల్లా వ్యవసాయ అధికారి

దరఖాస్తు విధానం

పట్టాదారు పాస్ పుస్తకంతోపాటు రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలతో దరఖాస్తు పత్రాన్ని పూర్తి చేసి క్లస్టర్ ఏఈఓలకు అందించాలి. కొత్త పాస్ పుస్తకం ఇంకారాని వారు తహసీల్దార్ డిజిటల్ సంతకంతో కూడిన పాస్ పుస్తకం నకలు జిరాక్స్‌తో దరఖాస్తు చేసుకోవచ్చు.